

వివరాలు మెయిన్‌లో

## పెంచిన హమాలీ కూలీ రేట్ల జిఒను విడుదల చేయకుంటే సమ్మె

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
బుధవారం | 30 సెప్టెంబరు , 2026 | పేజీలు : 7

# సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి

### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

### రూ.20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనం ప్రారంభం



**ప్రజాపక్షం/చండూరు:** నల్లగొండ జిల్లా చండూరు మండలం జోగిగూడెం గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని మంగళవారం ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిలు కలసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు,అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తూ ప్రజలకు మెరుగైన పాలన, ప్రభుత్వ సేవలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు.జోగిగూడెంలో నూతన గ్రామపంచాయతీ భవనం అందుబాటులోకి రావడంతో గ్రామ ప్రజలకు పరిపాలనా సేవలు మరింత సులభంగా అందనున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోగిగూడెం సర్పంచ్ ఆలేటి యాదయ్య,ఎంపీడీవో బండారు యాదగిరి,మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు,భూతరాజుదశరథ,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నల్పరాజు రామలింగయ్య,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మేకల సాగర్‌రెడ్డి,సర్పంచ్ పెండెం ధర్మేందర్,సిపిఐ నాయకులు తిప్పర్తి రాములు,ఆలేటి జగన్,నరసింహ,లక్ష్మీనరసింహ తదితరులు పాల్గొన్నారు.

**రూ.2.15 కోట్లతో 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన**

**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండలంలోని సరంపేట గ్రామంలో రూ.2.15 కోట్ల వ్యయంతో నిర్మించనున్న33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం,ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిలు కలిసి శంకుస్థాపన చేశారు.ప్రజా ప్రభుత్వంలో రైతులు ఇబ్బంది పడకుండా నిరంతర విద్యుత్ సరఫరా కోసం నూతన సబ్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయితే సరంపేటతో పాటు పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గడంతో పాటు,నాణ్యమైన విద్యుత్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ మౌలిక వసతులను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు.

# కోదాడలో రోగిపై డాక్టర్ దాడి

### భోజనానికి వెళ్లే సమయంలో వచ్చారని రోగిపై దురుసు ప్రవర్తన మెట్లపై నుండి తోసిన డాక్టర్ సైదా

### రోగి తలకు తీవ్ర గాయం.. పరిస్థితి విషమంగా ఉందని సమాచారం : సిఐ తీరుపై జర్నలిస్టుల ఆగ్రహం





**ప్రజాపక్షం/కోదాడ:** వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చిన మహిళను వైద్యుడు నెట్టివేయడంతో మెట్లపై నుంచి కిందపడిపోయి తీవ్రంగా గాయపడినట్లు బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించిన ఘటన కోదాడలో కలకలం రేపింది. మరోవైపు ఘటనను కవర్ చేసేందుకు వచ్చిన ప్రింట్ మీడియా జర్నలిస్టులు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో సిఐ దురుసుగా ప్రవర్తించడం పట్ల జర్నలిస్టులు తీవ్రంగా ఖండించారు. పాలకవీడు మండలం చెరువుతండాకు చెందిన పరంగిణికి ఆయాసం రావడంతో ఆమె కుమారుడు చందు కోదాడలోని శ్యామల నర్సింగ్ హోమ్‌కు తీసుకవచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. డాక్టర్ సైదా పరీక్షలు నిర్వహించి కొన్ని వైద్య పరీక్షలు సూచించినట్లు పేర్కొన్నారు. పరీక్షలు పూర్తయిన అనంతరం తిగిరి వైద్యుడిని కలిసేందుకు వెళ్లిన సమయంలో డాక్టర్ లంచ్‌కు వెళ్లేందుకు బయటకు వస్తున్నారని, రోగిని అత్యవసరంగా చూడాలని కోరినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సమయంలో డాక్టర్ ఆగ్రహంతో రోగిని నెట్టివేయడంతో ఆమె మెట్లపై నుండి కిందపడిపోయినట్లు వారు ఆరోపించారు. ఈ ఘటనలో మహిళ తలకు, కాలికి తీవ్రగాయాలయ్యాయని, కొంతసేపు అపస్మారక స్థితిలోకి వెళ్లారని కుటుంబ సభ్యులు తెలిపారు. వెంటనే ఆమెను మరో ఆసుపత్రికి తరలించగా మెదడులో రక్తం గడ్డకట్టినట్లు వైద్యులు తెలిపారని, మెరుగైన వైద్యం కోసం ఖమ్మంకు తరలించినట్లు కుమారుడు చందు వెల్లడించారు. ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన బాధిత కుటుంబ సభ్యులు శ్యామల నర్సింగ్ హోమ్ వద్ద ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితి పరిశీలించారు.

**జర్నలిస్టుల పట్ల సిఐ దురుసు ప్రవర్తన...**

శ్యామల నర్సింగ్ హోమ్‌లో జరిగిన ఘటన విషయం తెలుసుకున్న సిఐ శివశంకర్ శ్యామల నర్సింగ్ హోమ్ వద్దకు వచ్చినా వైద్యం చేయకపోగా డాక్టర్ దురుసు ప్రవర్తనతో మెట్లపై నుండి పడి తలకు తీవ్రగాయాలపాలై అపస్మారక స్థితిలో ఉన్న రోగిని, వారి బంధువులను అక్కడి నుంచి పంపించారు. విషయం తెలిసి అక్కడకు వచ్చిన మీడియా ప్రతినిధులతో మీకు ఏమీ పని, ఇక్కడ డబ్బులేనిదే ఇక్కడ ఎవడు పనిచేయడు, మీరు ఎవరితోనైనా మాట్లాడాలా... వెంటనే ఇక్కడ నుండి వెళ్లకపోతే కేసులు చేస్తాం అని తన ఇష్టా రాజ్యాంగ మాట్లాడుతూ జర్నలిస్టు ప్రతిధులను అక్కడి నుండి పంపడం విస్మయానికి గురిచేసింది. కనీసం మర్యాద పాటించకుండా మీడియా ప్రతినిధులతో, జర్నలిస్టులతో కస్సు బుస్సులాడారు. రాజ్యాంగ బద్దంగా న్యూస్ కవరేజ్‌కు వచ్చిన మీడియా ప్రతినిధులను అవమానకరంగా మాట్లాడటం పట్ల జర్నలిస్టు సంఘాలు తీవ్రంగా ఖండించాయి.

## ఆసిఫ్‌నగర్ కాలువలో పూడికతీతకు చర్యలు

### కాలువను మోటార్ సైకిల్‌పై పరిశీలించిన కలెక్టర్



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** వీబీజీ రాంజీ కింద ఆసిఫ్ నగర్ కాలువలో పూడికతీతతో పాటు గుర్రపు డెక్క, నాచును తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ డిఆర్‌డిఒను ఆదేశించారు. మంగళవారం ఆయన మండలంలోని అక్కినేపల్లి నుంచి చిప్పలపల్లి వరకు ఆసిఫ్ నగర్ కాలువను పరిశీలించారు. కాలువలో పూడిక, గుర్రపు డెక్క, నాచు, తూటి ఆకులు ఉండటం వల్ల నీరు కిందికి వెళ్లడం లేదని, తద్వారా ఆయకట్టుకు నీరు అందడం లేదని తెలుసుకున్న కలెక్టర్ మోటార్ సైకిల్‌పై సుమారు 4.5 కిలోమీటర్ల మేర కాలువను పరిశీలించారు. అనంతరం డీఆర్‌డివో శేఖర్ రెడ్డితో మాట్లాడుతూ ఆసిఫ్ నగర్ కాలువలో అవసరమైన చోట వీబీజీ రాంజీ కింద పూడిక తొలగించే చర్యలు చేపట్టాలని, పనులకు అంచనాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నా రు. పనులు చేపట్టే అన్ని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి తీర్మానం చేయాలని చెప్పా రు. పూడికతీతకు వీలుగా మార్చి,ఏప్రిల్ నెలలోనే నీటిని ఆపివేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. అనంతరం నూతనంగా ఏర్పడిన చిప్పలపల్లి గ్రామపంచాయతీని సందర్శించారు. కలెక్టర్ వెంట డీఆర్‌డివో శేఖర్ రెడ్డి,ఇరిగేషన్ డీఈ సునీత,ఏఈ శరత్ చంద్ర, వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, అక్కినేపల్లి సర్పంచ్ రాజు, ఆర్ఐ సైదులు,ఉపసర్పంచ్ లక్ష్మమ్మ, చిప్పలపల్లి సర్పంచ్ అంజిరెడ్డి తదితరులు ఉన్నారు.

## ఈ ఎన్నికలతో ఆర్‌టిసి విలీనం ముడిపడి ఉంది

### కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాల చారి

**ప్రజాపక్షం/సూర్యాపేట :** పదేళ్ళ తరువాత ఆర్‌టిసిలో జరిగే ఎన్నికలు ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్నాయని, ఈ ఎన్నికలతో ఆర్‌టిసి విలీనం ముడిపడి ఉందని కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాల చారి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని వైట్ హౌజ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కాంగ్రెస్ పార్టీ ఆర్‌టిసి ఎన్నికల ఇంచార్జి బొంతు రామ్మోహన్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, టిడబ్లుయు రాష్ట్ర అధ్యక్షులు మొగుళ్ల రాజిరెడ్డితో కలిసి మాట్లాడారు. ఆర్‌టిసి ఎన్నికల్లో టిఎంయు బలపర్చిన ఎస్‌డబ్ల్యుఎఫ్, టిడబ్ల్యుల ఐక్య కూటమికి కాంగ్రెస్ పార్టీ మద్ధతు పలికినట్లు వివరించారు. ఆర్‌టిసిని విలీనం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని త్వరలోనే తేదిని కూడా ప్రకటించడం జరుగుతుందన్నారు. ఆర్‌టిసి ప్రభుత్వంలో విలీనం కావాలంటే టిఎంయు బలపర్చిన ఎస్‌డబ్ల్యుఎఫ్, టిడబ్ల్యుయు ఐక్య కూటమి బాణం, నక్షత్రం గుర్తులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ సూర్యాపేట ఆర్‌టిసికి గౌరవాధ్యక్షుడిగా ఉన్న తాను 320 ఓట్లలో టిఎంయు ఐక్య కూటమికి 270 ఓట్లు వేయించి గెలిపిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్, వ్యవసాయ, రైతు సంక్షేమ కమీషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య, చివ్వెంల మండల అధ్యక్షులు ధరావత్ వీరన్న నాయక్ పాల్గొన్నారు.



## పట్టభద్రులందరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రాబోయే నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని అర్హులైన పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ నల్లమోతు భాస్కర్ రావు కోరారు. మంగళవారం మిర్యాలగూడ పట్టణంలో ఆయన తన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటును ఆన్‌లైన్ విధానంలో నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైన ఆయుధమని, డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా తక్షణమే ఓటరు జాబితాలో పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

## రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో లిటిల్ ఫ్లవర్ విద్యార్థుల ప్రతిభ




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రాష్ట్ర స్థాయి కరాటే పోటీలలో హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ విద్యార్థులు బంగారు పతకాలు సాధించి ప్రతిభ చాటారని పాఠశాల ప్రిన్సిపాల్ కెకె.జయరాజన్ తెలిపారు. మంగళవారం నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఉదయం ప్రార్థనా సమావేశంలో విజేతలైన విద్యార్థులను ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నల్గొండలోని వీరాంజనేయ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు. కటా, కుమిటే విభాగాలలో ఐదో తరగతి విద్యార్థిని పెదపంగ స్నిగ్ధ, మూడో తరగతి విద్యార్థిని జన్నపాల హాసిని ప్రియ, నాలుగో తరగతి విద్యార్థి చెనబోయిన సుజయ్‌కుమార్ మొదటి స్థానాల్లో నిలిచి స్వర్ణ పతకాలు కైవసం చేసుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ జిన్సీ జయరాజన్, హెడ్ మాస్టర్ టిఎం.సుజయ్‌కుమార్, ఐఐటీ విభాగాధిపతి యరగాని ప్రసాద్, ప్రైమరీ విభాగాధిపతి రాధిక, ఆఫీస్ ఇన్చార్జి రేపాల రవి కుమార్, డ్రిల్ మాస్టర్ నీలం రమేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**ప్రజాపక్షం/మోతె :** పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని కోదాడ శాసన సభ్యులు పద్మావతి రెడ్డి అన్నారు. మంగళవారం క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీలో పాల్గొని లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. మండలంలోని సుమారు 41 మందికి రూ.17.6లక్షల చెక్కులు అందించినట్లు చెప్పారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రతి ఒక్కరిని ప్రజా ప్రభుత్వం ఆదుకొని అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కీసర సంతోష్ రెడ్డి, మాజీ జడ్‌పిటిసి పుల్లారావు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వెలుగు వీరన్న పాల్గొన్నారు.

## వైద్య విద్యార్థుల వితరణ



**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం నేరడ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు కామినేని వైద్య కళాశాలకు చెందిన 2023 విద్యాసంవత్సరపు విద్యార్థులు మంగళవారం రోజున కూల్ వాటర్ డిస్పెన్సరీని బహుకరించారు. ఉద్భవ 2026 కార్యక్రమంలో భాగంగా సుమారు రూ. 12వేల విలువ గలిగిన డిస్పెన్సరీని బహుకరించి దానిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు సాయి రేవంత్, సాత్విక్ గౌడ్, అక్షయరెడ్డి, అక్షిత్, ధీరజ్, పునిత్ కృష్ణ, ముఖేష్, వంశీకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి నాగరాజు, హేమలత, రంగా రామలింగయ్య, పోషం లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## విశ్వకర్మ పథకంతో ఆర్థిక స్వావలంబన



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించి ఆర్థికంగా స్వావలంబన సాధించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మిర్యాలగూడ నియోజకవర్గ విశ్వకర్మ యోజన కన్వీనర్ చిలుకూరి శ్యామ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సుమారు 32 కులవృత్తులకు సంబంధించిన విభాగాల్లో ఉచిత శిక్షణ అందించడంతో పాటు ఆయా వృత్తులకు అవసరమైన పనిముట్లను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు శిక్షణ ఇవ్వడంతో పాటు శిక్షణ కాలంలో లబ్ధిదారులకు రూ.4 వేలు పారితోషికంగా అందిస్తున్నట్లు తెలిపారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో ఇప్పటివరకు 15 వేల మంది ఈ పథకం ద్వారా లబ్ధి పొందినట్లు తెలిపారు. లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా 50 పైసల వడ్డీతో రూ.1లక్ష వరకు రుణ సదుపాయం కల్పించి, వారు తమ వృత్తులను అభివృద్ధి చేసుకునేలా సహకారం అందించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కో కన్వీనర్ చిల్లంచర్ల అభి, బీజేపీ పట్టణ అధ్యక్షులు బంటు గిరి, ప్రధాన కార్యదర్శి కొంగరి వెంకటరమణ, శివరాం, మాదవి, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## సబ్ స్టేషన్ స్థలం పరిశీలన



**ప్రజాపక్షం/మోతె :** మండల కేంద్రంలో నూతన సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఏడిఇ పుల్లూరి వనజ రైతులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మండల కేంద్రంలో నిరంతరం విద్యుత్ అంతరాయంతో అల్లాడిపోతున్నట్లు చెప్పారు. అప్రకటిత విద్యుత్ కోతల కారణంగా పంటలు ఎండిపోతున్నాయని మండల కేంద్రానికి మామిళ్ళగూడెం సబ్ స్టేషన్‌కు సుమారు ఆరు కిలోమీటర్ల దూరం, లాల్‌తండాకు 8 కిలోమీటర్ల దూరం కావడంతో నాలుగు ఫీడర్లతో ఎటు నుంచి ఏమౌతుందో అర్థం కావడం లేదని వివరించారు. అనంతరం ఏడిఇ మాట్లాడుతూ ప్రభుత్వ భూమి ఉంటే అట్టి భూమిలో సుమారు ఒక ఎకరం స్థలం గ్రామంలో రైతులందరి సహకారంతో నూతన సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టుకోవచ్చన్నారు. సుమారు రూ.3కోట్ల విలువతో కూడిన సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వ అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి యండి ఇర్ఫాన్, ఫోర్‌మెన్ రషీద్, లైన్‌మెన్ బిక్షం, రైతులు కొమ్ము లింగరాజు, బొల్లం వెంకన్న, బొడ్డు నర్సయ్య, శ్రీకాంత్, ఉపేందర్ పాల్గొన్నారు.

## అర్హులైన పెన్షన్‌దారులను గుర్తించాలి



**ప్రజాపక్షం/మోతె :** అర్హులైన పెన్షన్ దారులను గుర్తించి నమోదు చేయాలని జడ్‌పి సిఇఓ శిరీష అన్నారు. మంగళవారం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా ఫించన్ల వెరిఫికేషన్ ఆన్‌లైన్ చేయడంలో ఎలాంటి తప్పులు జరగకుండా సక్రమంగా చేయాలని చెప్పారు. ఎంపిడిఓ, ఎంపిఓలను పెన్షన్లపై ఆరా తీశారు. ఎంతవరకు తనిఖీలు చేశారు, ఏ విధంగా తనిఖీ చేస్తున్నారని రిజిస్టర్లు వెరిఫికేషన్ చేసి సంతకాలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సందీప్ కుమార్, ఎంపిఓ వంశీ, ఈసీ శ్రీహరి పాల్గొన్నారు.

## బిజెపి దివ్యాంగుల విభాగం జిల్లా కో కన్వీనర్‌గా శ్రీనివాస్



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** బీజేపీ నల్గొండ జిల్లా దివ్యాంగుల విభాగం జిల్లా కో కన్వీనర్‌గా మిర్యాలగూడ పట్టణానికి చెందిన యామిని శ్రీనివాస్ నియమితులయ్యారు. మంగళవారం నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో బీజేపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర కో కన్వీనర్ గోలి ప్రభాకర్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గోలి ప్రభాకర్ మాట్లాడుతూ గత శాసనసభ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో దివ్యాంగులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చలేదని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి దివ్యాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. దివ్యాంగుల హక్కుల సాధన కోసం బీజేపీ దివ్యాంగుల విభాగం ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో దశలవారీగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని తెలిపారు. సమాజంలో దివ్యాంగుల సంక్షేమానికి తమ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మాధవరెడ్డి, అహ్మద్ ఖాన్, జిల్లా భాస్కర్, దర్శనం సైదులు, దర్శనం రాకేష్, గంధం రాకేష్, కట్టెబోయిన మల్లయ్య, ఖలీం బాబా, రాచూరి సైదులు తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహారంతోనే ఆరోగ్యం



**ప్రజాపక్షం/చిట్యాల:** పోషణ మాసం పురస్కరించుకుని నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటి కేంద్రంలోని మొదటి అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారం, ఆరోగ్యం, పరిశుభ్రతపై మంగళవారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ పందిరి గీత హాజరై మాట్లాడుతూ విద్యార్థులు, గర్భిణీలు, బాలింతలు సమతుల్య ఆహారం తీసుకున్నపుడే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించగలుగుతామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గాలి యాదమ్మ, దేశపాక లత, కో ఆప్షన్ సభ్యులు సాహెద, బెల్లి సత్తయ్య, హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు బోడ సుశీల, అంగన్‌వాడీ టీచర్లు అపర్ణ, దాడి అరుణ, బుజ్జమ్మ, కృష్ణవేణి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహార లోపాలను సరి చేయాలి

**ప్రజాపక్షం/మోతె :** పోషకాహార లోపాలు లేకుండా అవగాహనతో ప్రతి ఒక్కరూ సరి చేసుకోవాలని సిడిపిఓ శ్రీజ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో రైతువేదికలో 9వ పోషణ మాసం సందర్భంగా గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు తదితర ఆరోగ్యపరంగా అవసరమైన వర్గాలకు పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డి. అనురాధ, వైద్యాధికారి డాక్టర్ భవాని, ఎక్స్‌టెన్షన్ అధికారులు జ్యోతి, లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, పార్వతి, హిరణ్మయి, సుజిత, సావిత్రి, బాలింతలు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శిపై ఎంపిడిఓకు ఫిర్యాదు



**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం రంగాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిపై సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శి విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, గ్రామ పంచాయతీ పాలకవర్గాన్ని సంప్రదించకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు. గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న పలు కంపెనీల వ్యవహారంలోఅవినీతికిపాల్పడుతున్నారని వారుఆరోపించారు. గ్రామ పంచాయతీకి సంబంధించిన అభివృద్ధి పనులు, పరిపాలనా వ్యవహారాల్లో స్థానిక పాలకవర్గాన్ని పక్కన పెడుతున్నారని, పంచాయతీకి సంబంధించిన పలు విషయాల్లో స్పష్టత లేకుండా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే పంచాయతీ పరిపాలనకు సంబంధించిన వ్యవహారాల్లోఇబ్బందులుఎదురవుతున్నాయని వారు తెలిపారు.పంచాయతీ కార్యదర్శి వ్యవహారశైలిపై సమగ్రంగా విచారణ చేపట్టి,వాస్తవాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు ఎంపీడీవోను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యంజాల సరస్వతి గణేష్, ఉప సర్పంచ్ తాళ్ల ప్రవీణ్ రెడ్డి, ఏ బిజెపి మండల ఉపాధ్యక్షులు భీమారి రాజు, మాజీ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామయువకులుగ్రామస్తులుతదితరులు పాల్గొన్నారు.

## బీజేవైఎం జిల్లా కోశాధికారిగా పరమేష్ నాయక్

**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** బొమ్మలరామారం మండలం యావాపూర్ గ్రామానికి చెందిన మాడావత్ పరమేష్ నాయక్ బీజేవైఎం జిల్లా కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షులు దయ్యాల కుమారస్వామి మంగళవారం నియామక పత్రాన్ని అందజేశారు పార్టీ నాయకత్వం ఆయనపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించింది.యువమోర్చాలో చురుకుగా పనిచేస్తూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్న పరమేష్ నాయక్ను జిల్లా కోశాధికారిగా ఎంపిక చేయడం పట్ల బీజేపీ నాయకులు, యువమోర్చా నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.



## గోల్డ్ మోడల్ సాధించిన సంగిశెట్టి శాన్వి

**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ మండల గోపరాజుపల్లి గ్రామానికి చెందిన సంఘీ శెట్టి శాన్వి వలిగొండ పవిత్రాత్మ స్కూల్లో ఏడవ తరగతి చదువుతూ 2026 కేల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా కరాటే లీగల్ పోటీలో గెలిచి గోల్డ్ మెడల్ సాధించారు. ఉపాధ్యాయ బృందం తల్లిదండ్రులు బంధువులు అభినందన తెలిపారు.

## మోడల్ స్కూల్, హాస్టల్‌లో ఎంపిడిఓ సందర్శన



**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ మండల పరిధిలోని లోతుకుంట బాలికల హాస్టల్ను మండల పరిషత్ అభివృద్ధి అధికారి. జి జలంధర్ రెడ్డి. హాస్టల్లో పరిసరాలను విద్యార్థుల స్టాక్ రిజిస్టర్ను హాస్టల్లో నిర్వహిస్తున్న సరుకుల నామీద పరిమాణాన్ని స్వయంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ఫుట్ కమిటీ సభ్యులతో మాట్లాడి హాస్టల్ విద్యార్థుల కు ఎదురవుతున్న సమస్యలను సౌకర్యాలను భోజనానికి విద్యార్థులతో అభిప్రాయాలను తెలుసుకున్నారు. మధ్యాహ్నం భోజనం సమయంలో మండల పరిషత్ అధికారి స్థానిక సర్పంచ్ గందు రాములు విద్యార్థులకు భోజనం వడ్డించారు అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వీరి వెంట స్థానిక పంచాయతీ కార్యదర్శి క్రాంతి హాస్టల్స్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## చెక్కులు పంపిణీ



**ప్రజాపక్షం/వలిగొండ :** స్థానిక శాసనసభ్యుడు కుంభం అనిల్ కుమార్ రెడ్డి సౌజన్యంతో వలిగొండ మండల పరిధిలోని 89 మంది లబ్ధిదారులకు రూ.52 లక్షల విలువైన సీఎం సహాయ నిధి నిండి చెక్కులు మంగళవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బత్తిని సహదేవ్ గౌడ్ బాధిత కుటుంబాలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాశం సత్తిరెడ్డి, తుమ్మల యుగంధర్ రెడ్డి, ఎలిమినేటి సత్యనారాయణ, కాసుల వెంకన్, దండ మల్లికార్జున్, ఎమ్మె లక్ష్మ య్య పాల్గొన్నారు.

## పోషణ మాసం

**ప్రజాపక్షం/రామన్నపేట :** మండల పరిధిలోని బోగారం గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో మంగళవారం పోషణ మాసం సందర్భంగా గర్భిణీలు, బాలింతలు, తల్లులు, చిన్నారులకు పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోగారం గ్రామపంచాయతీ కార్యదర్శి ఏ.సుధా, బోగారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత,అంగన్వాడి టీచర్ బత్తుల వసంత,ఆశా వర్కర్లు జెల్ల సంధ్య,జెల్ల పారిజాత,అంగన్వాడి ఆయమ్మలు రత్నం పాల్గొన్నారు.

## చేనేత కార్మికులకు నిరంతర పనికల్పిస్తే స్వయం సమృద్ధి




**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** చేనేత కార్మికులకు నిరంతర పనికల్పిస్తే స్వయం సమృద్ధి సాధ్యమవుతుందని ప్రభుత్వం అన్ని రకాలుగా సంపూర్ణ సహకారం అందిస్తుందని పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశం స్పష్టం చేశారు.పోచంపల్లి పురపాలక పరిధిలో మంగళవారం రేవణపల్లి చేనేత సహకార సంఘం అధ్యక్షులు కర్నాటి జంగయ్య అధ్యక్షతన జరిగిన సర్వ సభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు.సంఘం అభివృద్ధికోసం సంఘటితంగా ఉండి సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్మికుల జీవన ప్రమాణాల పెంపుకు ఉపాధి మెరుగుకై సంఘ సభ్యులు లిఖిత పూర్వకంగా తన దృష్టికి తీసుకువస్తే ఎమ్మెల్యే ఎంపి సహకారంతో చేనేత పరిశ్రమ అభ్యున్నతికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని హామి ఇచ్చారు.ఏడి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ మగ్గాలపై చీరలు నేసే కార్మికులకు అందే పథకాలు లబ్ది పొందేందుకూ టెస్కో ద్వారా వస్త్రాలు కొనుగోలు చేసేల కలెక్టర్ కు ప్రతిపాదనలు పంపి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోచంపల్లి చేనేత సంఘం అధ్యక్షులు భారత లవకుమార్, అర్బన్ బ్యాంకు చైర్మన్ తడక రమేష్, మూ డవ వార్డు కౌన్సిలర్ రావుల జంగయ్య ,కిసాన్ జిల్లా అధ్యక్షులు మర్రి నర్సింహ్మారెడ్డి ,మహాజన సంఘం గౌరవ అధ్యక్షులు యాదగిరి పాల్గొన్నారు.

## ఉద్యోగ జీవితం వదిలి, శేష జీవితంలోకి శ్రవణ్ అడుగులు



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** ఉద్యోగ జీవితం వదిలి,శేష జీవితంలోకి శ్రవణ్ అడుగులు వేయాలని,ప్రభుత్వ ఉద్యోగిగా 37 సంవత్సరాలు సుదీర్ఘంగా సేవలందించడం అభినందనీయమని జెడ్పి సీఈవో శోభారాణి, మండల స్పెషల్ ఆఫీసర్ ,జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ జానయ్య లు అన్నారు. మంగళవారం తుర్కపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పర్యవేక్షకులుగా విధులు నిర్వహిస్తున్న మంగరాజు శ్రవణ్ కుమార్ పదవి విరమణ గావిస్తున్న సందర్భంగా వెంకటాపురం గ్రామంలోని జివిన్ఆర్ ఫంక్షన్ హాల్లో ఆత్మీయ అభినందన సన్మాన వీడుకోలు సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ రాజ్, ఎస్సీ కార్పొరేషన్ శాఖల్లో జిల్లాలో 37 సంవత్సరాలు సుదీర్ఘంగా అంకిత భావంతో సేవలందించిన శ్రవణ్ కుమార్ పదవి విరమణ పొందడం బాధాకరమైన విషయమైనా, ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ఉద్యోగ విరమణ తప్పదని అన్నారు.ఇంతకాలం తనను ఆదరించిన అధికారులకు, మండల ప్రజలకు, మంగరాజు శ్రవణ్ కుమార్ భావోద్వేగాలతో కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ జినుకల శ్యాంసుందర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీల టీఎన్జీవో రాష్ట్ర నాయకులు మందడి ఉపేందర్ రెడ్డి,ఇన్చార్జ్ ఎంపీడీవో వెంకటేశ్వర్లు, పిఎసిఎస్ చైర్మన్ ధనావత్ శంకర్ నాయక్, చాడ భాస్కర్ రెడ్డి, మాజీ ఎంపీపీ బబ్బూరి రవీంద్రనాథ్ గౌడ్ ,సర్పంచ్ మాధవి కరుణాకర్ గౌడ్ ,డిప్యూటీ సీఈవో శ్రీనివాస్, జిల్లా బిసి వెల్ఫేర్ ఆఫీసర్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

## భూముల రీ సర్వే కోసం గెజిట్ నోటిఫికేషన్



**ప్రజాపక్షం/చిట్యాల:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వేలో భాగంగా నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని పిట్టంపల్లి, పేరేపల్లి గ్రామాలకు గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందని నల్లగొండ ఆర్డిఓ అశోక్‌రెడ్డి అన్నారు. మండలంలోని పేరేపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన భూముల రీ సర్వే అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. పిట్టంపల్లి గ్రామంలో ఇప్పటికే సర్వే పూర్తికాబడిందని, పేరేపల్లి గ్రామంలో సర్వే ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా మొదటగా 318 సర్వే నెంబర్ భూమిని సర్వే చేపి ఇందులో గల గ్రామ సరిహద్దులు, గ్రామ కంఠం, ప్రభుత్వ భూములు, కుంటలు, శిఖము, రోడ్లను నిర్ణయించి తరువాత పట్టా భూములను సర్వే చేయడం జరుగుతుందన్నారు. సర్వే సమయంలో రైతులు తమ భూముల దగ్గర ఉండి వారి భూమి హద్దులను అధికారులకు తెలియజేయాల్సి ఉంటుందన్నారు. దీని ద్వారా రైతులకు ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, రైతులందరూ ఈ కార్యక్రమానికి సహకరించాలని అశోక్‌రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఎం విజయ్‌కుమార్, సర్పంచ్ రూపని సోనియా, ఆర్ఐ అమర్‌నాథ్‌రెడ్డి, సర్వేయర్ రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## చైర్మన్ పనితీరుపై పాలకవర్గ సభ్యుల ఆగ్రహం



**ప్రజాపక్షం/మర్రిగూడ :** పాలకవర్గ సభ్యులను సంప్రదించకుండా,ఆమోదం లేకుండా తన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని శివన్నగూడెం రైతు సేవా సహకార సంఘం చైర్మన్ పనితీరుపై పాలకవర్గ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు.మంగళవారం శివన్నగూడెం రైతు సేవా సహకార సంఘం 64వ సర్వ సభ్య సమావేశం జరిగింది.సమావేశంలో సభ్యులు సంఘానికి సంబంధించిన లావాదేవీలు,వడ్ల కొనుగోలు,ఫర్టిలైజర్లు, సంఘంలో ఉన్న ఆస్తులపై వచ్చిన అద్దెలు,చిన్న కమీషన్ల లెక్కలు చెప్పాలని నిలదీశారు.ఇష్టమొచ్చినట్లు సంఘంలో పనిచేసేందుకు ఉద్యోగులను నియమించే హక్కు మీ ఒక్కరికే లేదని,పాలకవర్గ సభ్యులు ఒప్పుకుంటేనే నియమించుకోవాలని ఘాటు విమర్శలు చేశారు. ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు చేస్తే సంఘం బలోపేతం కాకుండా నష్టపోయే ప్రమాదం ఉందని మాజీ చైర్మన్ మద్ది విట్టల్ రెడ్డి అన్నారు. ఇకనైనా పాలకవర్గ ఆమోదం లేకుండా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని సభ్యులు కోరారు.అంతకుముందు సంఘ బలోపేతానికి కొన్ని పనులను తీర్మానించారు.చైర్మన్ బాల్యం నర్సింహ అధ్యక్షతన జరిగినఈ సమావేశానికి వైస్ చైర్మన్ రంగినేని యాదగిరిరావు,వంగాల రవీందర్ రెడ్డి, కారింగు చంద్రయ్య, పొగాకు నర్సింహ,తోటకూరి ఎల్లయ్య,ఆనందరావు,సంఘం సెక్రటరీ,ఇన్చార్జి సెక్రటరీ సిర్రగోని వెంకటేష్,బండి మధు,రైతులు పాల్గొన్నారు.



## ఆగమ్మ కుటుంబానికి అండగా ఉంటాం

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండలంలో మహమ్మదాబాద్ గ్రామంలో సిపిఐ సీనియర్ నాయకుడు శంకర్ మాతృమూర్తి దంటిక ఆగమ్మ మృతి పట్ల నెల్లి కంటి సత్యం తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. పార్థివ దేహం పై ఎర్ర జెండా కప్పి, పూలమాలలు వేసి నివాళులర్పించిన ఆయన, పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. మాతృమూర్తిని కోల్పోవడం తీరని లోటని పేర్కొంటూ, ఈ విషాద సమయంలో కుటుంబానికి పార్టీ, అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య, కురుమిద్ద శ్రీనివాస్, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు కలకొండ సంజీవ, స్థానిక సర్పంచ్ ముత్యాల అంజయ్య, మండల కార్యవర్గ సభ్యుడు మల్లారెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా సేవా సంకల్ప అభియాన్



**ప్రజాపక్షం/వలిగొండ :** భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాసేవ ప్రస్థానాన్ని పురస్కరించుకుని బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప అభియాన్' కార్యక్రమాల్లో భాగంగా వలిగొండ మండలం టేకులసోమారం గ్రామంలోని 'సాధన మానసిక వికలాంగుల కేంద్రం (ఆశ్రమం)'లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.బీజేపీ యాదాద్రి భువనగిరి జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు పదులది రాంచందర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆశ్రమంలోని వారికి భోజనాన్ని అందించారు. ఈ సందర్భంగా వారితో కొంత సమయం గడిపి ఆప్యాయతను పంచుకున్నారు. రాష్ట్ర పాలసీ సెల్ కన్వీనర్ సర్వి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు పట్నం శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల యాదిరెడ్డి, వలిగొండ మండల అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్, పట్టణ అధ్యక్షుడు బలరాం పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిబంధనలు పాటించాలి



**ప్రజాపక్షం/హాలియా :** ఎరువుల విక్రయాలలో ప్రభుత్వ నిబంధనలు పాటించని దుకాణాలపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్ హెచ్చరించారు.మంగళవారం హాలియాలోని ఎరువుల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎరువుల డీలర్ల వద్ద ఉన్న స్టాక్ రిజిస్టర్లు, ఇన్వాయిస్‌లు, ఎరువుల లైసెన్సులు,ఓ-ఫారాలు తదితర రికార్డులను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని సూచించారు.ఎరువుల గోదాములను తనిఖీ చేసి నిల్వ చేసిన ఎరువులను పరిశీలించారు. లైసెన్స్‌లో అనుమతించని ఎరువులను నిల్వ చేస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట హాలియా సహాయ సంచాలకురాలు సరిత, మండల వ్యవసాయ అధికారి వెంకన్న తదితరులు ఉన్నారు.

## సిఎం దిష్టిబొమ్మ దహనం

**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** బీజేపీ తెలంగాణ రాష్ట్ర పార్టీ, జిల్లా పార్టీ ఆదేశాల మేరకు బొమ్మలరామారం మండల కేంద్రంలో బీజేపీ, బీజేవైఎం, వివిధ మోర్చాల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.శ్రీరాముడు, పరమశివుడి విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు హిందూ సమాజమనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని బీజేపీ నాయకులు ఆరోపించారు.



## ఎస్‌సి కార్పోరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా రాగి ఉపేందర్ రావు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ఎస్‌సి కార్పోరేషన్ సూర్యాపేట జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా రాగి ఉపేందర్ రావు మంగళవారం నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌సి కార్పోరేషన్ ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంతోపాటు అర్హులైన ఎస్‌సి లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా కార్పోరేషన్ అధికారులు, సిబ్బంది నూతన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## కూరగాయల మార్కెట్‌కు అనువైన స్థలం కేటాయించాలి



**ప్రజాపక్షం/హాలియా:** పట్టణంలో కూరగాయల మార్కెట్ కు అనువైన స్థలం కేటాయించాలని అన్నపూర్ణ కూరగాయల మార్కెట్ అసోసియేషన్ సభ్యులు మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి కి వినతిపత్రం అందజేశారు. సరైన మార్కెట్ సౌకర్యం లేక వ్యాపారులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చైర్మన్ కు వివరించారు. హాలియా లో వ్యాపారాలు విస్తరించడం వలన కూరగాయల వ్యాపారం చేసుకోవడం కోసం అనువైన స్థలం లేక వ్యాపారులు అది ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. దీనిపై స్పందించిన చైర్మన్ చింతల చంద్రారెడ్డి మాట్లాడుతూ కూరగాయల వ్యాపారులకు అనువైన స్థలం చూసి వ్యాపారానికి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తానని తెలిపారు.చైర్మన్ తో పాటు వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్,కౌన్సిలర్ చెరుపల్లి ముత్యాలు,వ్యాపారులు తదితరులు ఉన్నారు.

## గ్రామాల అభివృద్ధే లక్ష్యం

**ప్రజాపక్షం/తిరుమలగిరిసాగర్ :** స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా మంగళవారం మండలంలోని తూటిపేట,గాట్ తండా గ్రామాల్లో అంగన్వాడీ స్కూళ్లకు మరుగుదొడ్ల నిర్మాణంలో భాగంగా తిరుమలగిరి మండల ప్రజా పరిషత్ అధికారి శ్రీనివాస్ రెడ్డి ముగ్గు పోసే కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి తన వంతు సహకారం ఎప్పుడూ అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీ శ్రీరాములు,టెక్నికల్ అసిస్టెంట్ కార్తీక్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుజాత,అంగన్వాడీ టీచర్లు మంగమ్మ, వినోజా,పాలకవర్గ సభ్యులు బుజ్జి, చందు నాయక్, హన్యా నాయక్,నాయకులు సుఖ నాయక్,మల్టీపర్పస్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



## లీగల్ మెట్రాలజీ శాఖ తనిఖీలు - 13 కేసులు నమోదు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** పట్టణంలోని వివిధ కూరగాయల దుకాణాలు,ఇనుము,హార్డ్‌వేర్ దుకాణాలు మరియు శానిటరీ దుకాణాలలో జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి శ్రీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీలలో జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి శ్రీనివాసులుతో పాటు టెక్నికల్ అసిస్టెంట్ కె. వెంకటేశ్వర్లు,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.తనిఖీల సందర్భంగా వ్యాపార సంస్థలలో వినియోగిస్తున్న తూకాలు, కొలతల పరికరాల ధృవీకరణ, స్టాంపింగ్ చెల్లుబాటు, ఖచ్చితత్వం, అలాగే ప్యాకేజ్డ్ వస్తువులపై తప్పనిసరిగా ప్రకటించాల్సిన వివరాలు తదితర అంశాలను పరిశీలించారు.నిబంధనలను ఉల్లంఘించినట్లు గుర్తించిన వ్యాపార సంస్థలపై మొత్తం 13 కేసులు నమోదు చేయడం జరిగింది. సంబంధిత కేసుల్లో నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టబడతాయని అధికారులు తెలిపారు.వ్యాపారులు తూకాలు,కొలతల పరికరాలను నిర్ణీత కాలవ్యవధిలో ధృవీకరించించుకొని, చెల్లుబాటు అయ్యే స్టాంపింగ్‌తో మాత్రమే వినియోగించాలని,ప్యాకేజ్డ్ వస్తువుల విషయంలో చట్టపరంగా నిర్దేశించిన అన్ని వివరాలను తప్పనిసరిగా ప్రకటించాలని జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి సూచించారు. వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణకు తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

## డిఇఈ బదిలీపై హర్షం వ్యక్తం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** గత ఐదు సంవత్సరాలుగా సూర్యాపేట జిల్లా విద్యాశాఖాధికారిగా పనిచేసిన అశోక్ బదిలీ కావడంతో మంగళవారం పలువురు విద్యార్థి సంఘాల నాయకులు స్థానిక 60 ఫీట్ల రోడ్డులో బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా విద్యాశాఖ అధికారిగా పనిచేసిన అశోక్ కుమార్ ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తూ, ప్రైవేట్, కార్పోరేట్ విద్యా వ్యవస్థను ప్రోత్సహించాడని మండిపడ్డారు. జిల్లా వ్యాప్తంగా విద్యారంగంలో నెలకొన్న ఏ ఒక్క సమస్య కూడా పరిష్కరించలేకపోయారని విమర్శించారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించిన ప్రైవేట్, కార్పోరేట్ విద్యాసంస్థలపై పలువురు ఫిర్యాదులు చేసినా, అవినీతి అక్రమాలను బయటపెట్టినా, సాక్ష్యాదారాలు ఉన్నప్పటికి వారికి వత్తాసు పలుకుతూ సమస్యను పక్కదారి పట్టించడం తప్ప చేసిందేమి లేదన్నారు. ఈ కార్యక్రమంలో పలు విద్యాసంఘాల నాయకులు ధనియాకుల శ్రీకాంత్ వర్మ, వావిళ్ళ రమేష్ గౌడ్, నిద్ర సంపత్ నాయుడు, ఎర్ర అఖిల్, గంగారపు శ్రీనివాస్, శివ, నరేష్, ఉపేందర్, లోకేష్, సతీష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** మహిళలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకొని లైంగికంగా సంక్రమించే వ్యాధుల నివారణపై అవగాహన కలిగి ఉండాలని డీఎంహెచ్ఓ డాక్టర్ కే. రాహుల్ సూచించారు.వాణిజ్య లైంగిక కార్యకలాపాల్లో ఉన్న మహిళలకు ఆరోగ్య, న్యాయ సహాయం, సామాజిక భద్రతపై మంగళవారం నల్లగొండలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వారికి, వారి పిల్లలకు ఆరోగ్యం,హెచ్ఐవీ, ఎస్‌టిఐ నివారణ,సామాజిక భద్రత,జీవనోపాధి అవకాశాలు,న్యాయ సహాయం, రక్షణ తదితర సంక్షేమ సేవలకు మెరుగైన ప్రాప్యత కల్పించే లక్ష్యంతో మహిత వాలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో,ఎస్‌బిఐ ట్రస్ట్ సహకారంతో అమలు చేస్తున్న శక్తి ప్రాజెక్టు, డీఏపీసీయూ సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హిమబిందు మాట్లాడుతూ వాణిజ్య లైంగిక కార్యకలాపాల్లో ఉన్న మహిళలకు అందుబాటులో ఉన్న ఉచిత న్యాయ సహాయం, న్యాయ సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శంకర్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ నాగేష్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ గణేష్,సీడీపీవో కలావతి, అంజయ్య గౌడ్,వి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## లండన్‌లో ఎన్నారై బిసి గర్జన సభ



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** భౌగోళిక తెలంగాణ సాధనతోనే తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయని ఎన్నారై బీసీ సెల్ అధ్యక్షుడు కిరణ్ కుమార్ దూదిగం అన్నారు.బీసీల సామాజిక, రాజకీయ, విద్యా,ఆర్థిక సాధికారతే లక్ష్యంగా ఎన్నారై బీసీ సెల్ యూకే ఆధ్వర్యంలో మంగళవారం లండన్‌లో నిర్వహించిన ఎన్నారై బీసీ గర్జన సభలో ఆయన మాట్లాడుతూ.. బీసీలకు జనాభా ప్రాతిపదికన అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం, విద్యా ఉద్యోగ రంగాల్లో సమాన భాగస్వామ్యం,బీసీ సంక్షేమ బడ్జెట్ సక్రమ వినియోగం, సామాజిక న్యాయం జరగాలన్నారు.బీసీల హక్కులు, ప్రాతినిధ్యం,సామాజిక న్యాయం వంటి అంశాలపై విదేశాల్లోనూ చర్చ మరింత విస్తృతమైందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాగరాజ్ తౌటం,వేణు కలకోట, సునీల్ కొక్కొండ,మధుసూదన్ గౌడ్,హరి గౌడ్ నవాపేట్,రవి ప్రదీప్ పులుసు,సురేష్ గోపతి,హరినాథ్, చరణ్,రఘు జక్కుల,ఆనంద్, ఉపేందర్, అనిల్ దసరం,పవన్,రాజు,నవీన్,ఉపేందర్ దూదిగం, తదితర సామాజిక కార్యకర్తలు, సంఘాల ప్రతినిధులు, ప్రవాస భారతీయులు పాల్గొన్నారు.



## నోముల కనకదుర్గ గుడి నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**ప్రజాపక్షం/నకిరేకల్ :** మండలంలోని నోముల గ్రామంలో శ్రీవిజయ కనకదుర్గా దేవి ఆలయ నూతన కమిటీని 2026/27 సంవత్సరానికి గాను ప్రజల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారుడిగా గుండంరాజు కళ్యాణ్ రావు,అధ్యక్షుడిగా పూరం సంతోష్, ఉపాధ్యక్షురాలిగా సామ నిర్మల, కార్యదర్శిగా ఎలజాల సైదులు ఎన్నికయ్యారు.కమిటీ సభ్యులుగా పెండెం సాగరిక,భూపతి రేణుక,కనుకుల రాజేశ్వరి రెడ్డి,భూపతి నర్సింహ్మ గౌడ్,భూపతి జాని,బాదిని యాదయ్య,రాచకొండ మహేష్,యల్కకంటే జానయ్య,మాచర్ల రాములు, దేవగాని వేణు,ఆలకుంట్ల నాగయ్య ఎన్నికయ్యారు.ఎన్నికైన నూతన కమిటీని ఆలయ శాశ్వత చైర్మన్ ముసుకు స్టాలిన్ రెడ్డి,ఆలయ ధర్మకర్త కొడదల బక్కయ్య, ఉప సర్పంచ్ కోమటిరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి,మార్కెట్ కమిటీ డైరెక్టర్ వరకాంతం శేఖర్ రెడ్డి,మాజీ సర్పంచ్ భీమనబోయిన వెంకటయ్య, నాయకులు సామ రవీందర్ రెడ్డి,సామ సురేందర్ రెడ్డి, కోమటిరెడ్డి జాన్ రెడ్డి తదితరులు అభినందించారు.

## డ్రోన్ ప్రతిభకు జాతీయ గుర్తింపు

**ప్రజాపక్షం/నకిరేకల్ :** మండలంలోని చందుపట్ల గ్రామానికి చెందిన కొప్పు సాయికుమార్ ప్రతిష్టాత్మకమైన భారత్ కళా పురస్కార్ 2026 అవార్డుకు ఎంపికయ్యారు. ఫోటో పరివార్ ఇండియా నెట్‌వర్క్,వందేభారత్ సంయుక్త సౌజన్యంతో నిర్వహించిన పురస్కారాల్లో ఆయన బెస్ట్ డ్రోన్ వీడియో గ్రాఫర్ విభాగంలో గౌరవాన్ని సాధించారు.తన అద్భుతమైన డ్రోన్ వీడియో గ్రఫీ ప్రతిభతో నకరేకల్ ప్రాంతానికి,చందుపట్ల గ్రామానికి అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చిన సాయి కుమార్‌ను వివేకానంద జనం మండలి ప్రతినిధులు కొనియాడారు.ప్రతిభ కేవలం సాధించబడదు గౌరవించబడుతుందనే మాటకు సాయికుమార్ నిదర్శనంగా నిలిచారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివేకానంద జనం మండలి అధ్యక్షుడు కొండ కోటేష్, మండలి సభ్యులు అభినందించారు.

## అక్టోబర్ 3న జల్సా-ఎ-ఖాతీముల్ అంబియా మహాసభ

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** మజ్లిస్ ఎ తహఫ్ఫుజ్ ఖత్మె నబువ్వత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో అక్టోబర్ 3న సూర్యాపేట జిల్లా కేంద్రంలో జల్సాఎఖాతీముల్ అంబియా వ ఇస్లాఎముఆషిరా పేరిట భారీ ధార్మిక, సామాజిక సంస్కరణల మహాసభ నిర్వహించనున్నట్లు సభ కన్వీనర్ హాఫీజ్ ఖలీల్ అహ్మాత్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం రాత్రి 8.30 గంటలకు మస్జిద్ఎఅక్సా ప్రాంగణంలో జరిగే ఈ సభకు దేశంలోని ప్రముఖ ఇస్లామిక్ విద్వాంసులు, ఉలేమాలు, మతపెద్దలు హాజరై ధార్మిక, సామాజిక అంశాలపై ప్రసంగించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి గుజరాత్‌లోని బరోడాకు చెందిన ప్రముఖ ఇస్లామిక్ విద్వాంసులు హజ్రత్ మౌలానా ముఫ్తీ షఫీక్ అహ్మద్ సాహబ్ దామత్ బరకాతుహు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ప్రసంగం చేయనున్నారని చెప్పారు. మౌలానా అత్హర్ మజాహిరీ సాహబ్ అధ్యక్షతన సభ జరుగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్‌పి కె. నరసింహ హాజరవుతున్నారన్నారు. ఈ సభకు జిల్లాలోని ముస్లీం సోదరులంతా అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## మీ ఓటు నమోదు చేసుకోండి

**ప్రజాపక్షం/దేవరకొండ;** పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు నమోదుకు ప్రక్రియ ప్రారంభమైందని ప్రతి పౌరుడు తమ ఓటును నమోదు చేసుకోవాలని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ సూచించారు. ఉమ్మడి నల్గొండఖమ్మంవరంగల్ జిల్లాల పరిధిలోని అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు పట్టభద్రుల నియోజకవర్గ ఓటరుగా తప్పనిసరిగా మీ పేరును నమోదు చేసుకొని ఓటును పొందాలన్నారు. ఫారం18 దరఖాస్తుల స్వీకరణను చివరి అక్టోబర్ 06 కాగా మీ ఓటుమీహక్కు, మీ ఓటు మీ భవిష్యత్తుగా అర్హత ఉన్న ప్రతి పట్టభద్రుడు ఆలస్యం చేయకుండా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు.



## నియోజకవర్గ ఎంఆర్‌పిఎస్ ఉపాధ్యక్షుడిగా ప్రభు ఏకగ్రీవం

**ప్రజాపక్షం/దేవరకొండ;** దేవరకొండ నియోజకవర్గ ఎంఆర్‌పిఎస్ ఉపాధ్యక్షులుగా పట్టణానికి చెందిన పొట్ట ప్రభు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం పట్టణం లోని టిటిడి కళ్యాణ మండపంలో ఎంఆర్‌పిఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షులు మేడి పాపన్న, మోహన్ మాదిగ ఆదేశాల మేరకు నియోజకవర్గ ఉపాధ్యక్షులుగా పొట్ట ప్రభు ఏక్రగీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సైదులు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటయ్య, ఏసయ్య, జిల్లా అధ్యక్షులు గిరి, పట్టణ నాయకులు రమేష్, నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు నాగరాజు, మండల అధ్యక్షులు గిరి తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి టీచర్లకు, ఆశ వర్కర్లకు, ఆయాలకు శాలువాలతో సత్కారం



**ప్రజాపక్షం/మోటకొండూర్ :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రజాసేవలో మైలురాళ్లను పురస్కరించుకొని సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నిర్వహిస్తున్న( సేవ సంకల్పు అభియాన్) కార్యక్రమంలో భాగంగా మోట కొండూరు మండలంలో బిజెపి మహిళా మోర్చా ఆధ్వర్యంలో అంగన్ మిలన్ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజ ఆరోగ్య పరిరక్షణతో పాటు చిన్నారుల ఎదుగుదలకు అంకిత భావంతో సేవలందిస్తున్న అంగన్వాడి టీచర్లు,ఆశా వర్కర్లను, ఆయాలను ఘనంగా సత్కరించారు. వారి సేవలను నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బుల్లెట్ మాధురి చంద్ర, జిల్లా ఉపాధ్యక్షురాలు లక్కాకుల మాధురి, జిల్లా కార్యదర్శి తోటకూరి మహాలక్ష్మి,జిల్లా కార్యవర్గ సభ్యులు చిర్ర రవీందర్,గాజుల బాలరాజ్ గౌడ్ పాల్గొన్నారు.

## రేషన్ కార్డుల పంపిణీ

**ప్రజాపక్షం/మునుగోడు :** అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సన్నబియ్యం పథకం మరింత పారదర్శకంగా, ప్రతి అర్హ కుటుంబానికి చేరేలా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేపట్టినట్లు ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.మంగళవారం మునుగోడు మండల కేంద్రంలోని రైతు వేదికలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు రేషన్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నేలపట్ల నరేష్,ఎంపీడీవో వెంకటేశ్వర్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



## అక్టోబర్ 02న జర్నలిస్టుల దేశవ్యాప్త ధర్నా

**ప్రజాపక్షం/దేవరకొండ;** జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం అక్టోబర్ 02న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న జర్నలిస్టుల ధర్నా, నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని టియూడబ్ల్యూజేఐజేయూ దేవరకొండ డివిజన్ అధ్యక్షులు గాదె గిరిధర్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్నారని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టుల హక్కులు, సంక్షేమ, రక్షణకు ప్రభుత్వాలు తగిన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. జర్నలిస్టుల సమస్యలపై దేశవ్యాప్తంగా చేపడుతున్న ఈ నిరసన కార్యక్రమంలో దేవరకొండ డివిజన్‌లోని ప్రతి జర్నలిస్టు భాగస్వాములు కావాలని కోరారు. డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో మండల వారిగా ర్యాలీలు నిర్వహించి, అనంతరం అంబేద్కర్, గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించాలని సూచించారు. జర్నలిస్టుల హక్కుల సాధన కోసం నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ఐక్యంగా, శాంతియుతంగా నిర్వహించాలని ఆయన కోరారు. ప్రతి మండలంలో జర్నలిస్టుల సంఘాల ప్రతినిధులు, ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా జర్నలిస్టులు సమన్వయంతో కార్యక్రమాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఖాజా మోహినోద్దిన్, వెంకట్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి శ్రీనివాస్, సహాయ కార్యదర్శులు శంకర్, ఇలియాజ్‌బాబా, సహదేవుడు, కార్యవర్గ సభ్యులు అచ్యుత్‌కుమార్, సయ్యద్‌పాషా, శంకర్, ప్రవీణ్, శ్రీనివాస్, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

## ఎస్సీ, ఎస్టి, బిసి సంక్షేమ హాస్టళ్లను గాలికి వదిలేసిన ప్రభుత్వం

**ప్రజాపక్షం/దేవరకొండ;** ఎస్సీ, ఎస్టి, బిసి సంక్షేమ హాస్టళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని బిఆర్‌ఎస్‌వి దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ ఆరోపించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదని హాస్టల్ వార్డెన్లు ఇష్టారాజ్యాంగా వ్యవహరిస్తూ విద్యార్థులకు అందుబాటులో ఉండడం లేదని, అధికారులు కూడా సమస్యల పరిష్కారం పై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. హాస్టళ్లలో ప్రభుత్వం నిర్దేశించిన మెనును సక్రమంగా అమలు చేయడం లేదని, నాణ్యత లేని ఆహారం అందడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి హాస్టళ్లలో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ప్రభుత్వం మొద్దునిద్ర వీడి సంక్షేమ హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి సారించి పెండింగ్‌లో ఉన్న కాస్మొటిక్, మెస్ చార్జీలను తక్షణమే విడుదల చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

## బిఆర్ఎస్ నేతపై దాడి.. ఎస్పికి ఫిర్యాదు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నకిరేకల్ నియోజకవర్గంలోని మర్రూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు షేక్ మహ్మద్‌పై దాడికి పాల్పడిన కాంగ్రెస్ వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య జిల్లా ఎస్‌పికి ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా చిరుమర్తి మాట్లాడుతూ మర్రూరుకు చెందిన కాంగ్రెస్ నాయకుడు సోషల్ మీడియాలో బీఆర్ఎస్ పార్టీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తున్నారని,ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని షేక్ మహ్మద్ సోషల్ మీడియా ద్వారా సందేశం పెట్టడంతో సదరు వ్యక్తి మరింత రెచ్చిపోయి స్థానిక ఎమ్మెల్యే అండదండలతో దాడికి పాల్పడ్డారని ఆరోపించారు.దాడిలో గాయపడిన వ్యక్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా,ఆయనపైనే కేసు నమోదు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.తాను బాధితుడికి న్యాయం చేయాలని కోరేందుకు పోలీస్ అధికారులను కలిసేందుకు వెళ్లినా కనీస మర్యాద కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## అరుదైన గౌరవం

**ప్రజాపక్షం/రామన్నపేట :** గత 27 సంవత్సరాలుగా నిరంతరాయంగా ఒకే విద్య సంస్థలు పని చేస్తూ విద్యా రంగంలో విశేష సేవలందిస్తూ ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న స్థానిక వివేకానందాస్ డివైన్ మోడల్ స్కూల్ ఉపాధ్యాయినికి అరుదైన గౌరవం దక్కింది. ట్రస్మా ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో ఆమెకు 'విద్యా సేవా రత్న అవార్డు' లభించింది. విద్యాబోధనలో ఆమె కనబరుస్తున్న ప్రతిభ,నిబద్ధతలకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని ప్రధానం చేశారు. ఈ సందర్భంగా అవార్డు సాధించిన ఉపాధ్యాయినిని పాఠశాల వ్యవస్థాపకులు మల్లికార్జున్, ప్రిన్సిపాల్,ఉపాధ్యాయ బృందం, పాఠశాల సిబ్బంది,తల్లిదండ్రులు మరియు విద్యార్థులు అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.





## ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** సమాజంలో ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని పిఏసిఎస్ చైర్మన్ గుడిపాటి సైదులు, తహశీల్దార్ దయానందం, ఎంపిడిఓ చలపతి, మార్కెట్ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్నలు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మండల ఉత్తమ ఉపాధ్యాయులను ఎంఈఓ లింగయ్యతో కలిసి పూలమాలలు, శాలువాలతో సన్మానించి మాట్లాడారు. భావి భారత పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైందన్నారు. అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులను సత్కరించడం సంతోషకరమన్నారు.



## ఆర్‌టిసి కార్మికుల హక్కుల పరిరక్షణకు కృషి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఆర్‌టిసి కార్మికుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తామని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. మంగళవారం తెలంగాణ ఆర్‌టిసి గుర్తింపు యూనియన్ ఎన్నికల నేపథ్యంలో సూర్యాపేట డిపోలో ఆయన ప్రచారం నిర్వహించారు. కార్మికుల ఉద్యోగభద్రత, మెరుగైన వేతనాలు, పదోన్నతులు, ఆరోగ్యభద్రత, కుటుంబ సంక్షేమం, పెండింగ్ సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, సామాజిక భద్రత వంటి అంశాలపై గుర్తింపు యూనియన్ ద్వారా బలమైన వాణిని వినిపించాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియకు సంబంధించి ముందుకు తీసుకెళ్లాల్సిన అంశాలపై కూడా చర్చిస్తున్నట్లు తెలిపారు. అక్టోబర్ 9న జరగనున్న టిజిఆర్‌టిసి గుర్తింపు యూనియన్ ఎన్నికల నేపథ్యంలో టిడబ్ల్యుయుఎస్‌డబ్లుఎఫ్ కూటమి అభ్యర్థులకు మద్ధతు తెలిపి బాణం, నక్షత్రం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కార్మికులను కోరారు.

## ఇసిఐపై కాంగ్రెస్ ఆరోపణలు అబద్ధం



**ప్రజాపక్షం/రామన్నపేట :** ఎన్నికల ప్రధాన కమిషనర్ పై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న నిరాధార ఆరోపణలను నకిరేకల్ ఎమ్మెల్యే అభ్యర్థి,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నకిరేకంటి మొగులయ్య తీవ్రంగా ఖండించారు.స్థానిక రహదారి బంగ్లాలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నీచ రాజకీయాలకు తెరలేపిందని మండిపడ్డారు. ఇండియన్ ఎక్స్ప్రెస్ పత్రిక ప్రచురించిన ఒక ఫేక్ ఇన్వెస్టిగేటివ్ కథనాన్ని ఆధారం చేసుకుని,కాంగ్రెస్ పార్టీ ఈసీఐపై అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను మభ్యపుస్తోందని ధ్వజమెత్తారు.ఫామ్6 ద్వారా ఓట్ల తొలగింపు, డిక్లరేష్ప కాంగ్రెస్ చేస్తున్న విమర్శలు అవాస్తవమని,ఈ డిక్లరేషన్ రాజ్యాంగబద్ధమైనదేనని స్వయంగా సుప్రీంకోర్టు మే 27,2006న తీర్పునిచ్చిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి,స్టేట్ కౌన్సిల్ మెంబర్ వనం అంజయ్య,ప్రధాన కార్యదర్శి జంగిలి వార్డు సభ్యులు సుర్వి హరి బాబు,ఉపాధ్యక్షులు బట్టే రమేష్,నకిరేకంటి రవి,గురుకు సైదులు తదితరులు పాల్గొన్నారు.

## మండలానికి ప్రత్యేక విద్యుత్ సెక్షన్ ఏర్పాటు చేయాలి

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** మండలానికి ప్రత్యేక విద్యుత్ సెక్షన్ కార్యాలయం ఏర్పాటు చేయాలని లంబాడి విద్యార్థి సేన సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షులు లకావత్ వీరన్న నాయక్ డిమాండ్ చేశారు. మండలానికి ప్రత్యేక విద్యుత్ సెక్షన్ కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం జిల్లా విద్యుత్ శాఖ అధికారి పి. యాదగిరిని కలిసి వినతి పత్రం అందజేశారు. మండలంలో విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలు, విద్యుత్ శాఖకు సంబంధించిన కార్యాలయ సేవల కోసం ప్రజలు సూర్యాపేట తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ అంతరాయాలు, కొత్త కనెక్షన్లు, మీటర్లు, సర్వీస్ సమస్యలు తదితర ఫిర్యాదులను స్థానికంగానే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు, విద్యార్థులు, గృహ వినియోగదారులు, వ్యాపారులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలపై అధికారులు త్వరితగతిన స్పందించాలని కోరారు. నాయకులు శివ పాల్గొన్నారు.





## సంప్రదాయ ఆహార పదార్థాలకు ప్రాధాన్యత ఇవ్వాలి

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** సాంప్రదాయ ఆహారాలకు ప్రాధాన్యత ఇవ్వాలని మున్సిపల్ చైర్మన్ కొణతం చిన్న వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం నేరేడుచర్ల పట్టణంలో సెక్టార్ స్థాయి 9వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబం ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, మన ప్రాంతంలో సులభంగా లభించే స్థానిక సాంప్రదాయ ఆహార పదార్ధాలను రోజు వారి ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. సిడిపివో హడావత్ పార్వతి మాట్లాడుతూ మన అంగన్ వాడీ, మన బాధ్యత అనే భావనతో ప్రతి ఒక్కరు అంగన్ వాడీ బలోపేతానికి సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నూకల సందీప్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు, సీనియర్ అసిస్టెంట్ చంద్రకళ, హెల్త్ సూపర్‌వైజర్ దానమ్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రాజ్యలక్ష్మి , యశోధ, ధరణి, రాజేష్, పాపమ్మ, అంగన్ వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## కౌమార దశలో వచ్చే మార్పులపై అవగాహన



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** కౌమారదశలో వచ్చే శారీరక, మానసిక భావోద్వేగ మార్పులు, ఆరోగ్య సమస్యలు, మానసిక ఆరోగ్యం వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సైకియాట్రిస్ట్ డాక్టర్ శ్రావంతి అన్నారు. మంగళవారం అనాజిపురం పిఎంశ్రీ టిజిఎంఎస్ పాఠశాలలో గర్ల్ చైల్డ్ ఎంపావర్‌మెంట్ , ఎడాలసెంట్ సేఫ్టీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బాలల భద్రత, బాల్యదశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం నశా ముక్త్ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోడి లింగయ్య, ఇంచార్జి ఉపాధ్యాయులు రాజయ్య, జయంతి, వైద్యాధికారి అనూష, పాల్గొన్నారు.

## రేషన్ కార్డుల పంపిణీ

**ప్రజాపక్షం/నాంపల్లి :** మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కత్తి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ అంబటి ఆంజనేయులు, ప్రజాప్రతినిధులు హాజరై అర్హులైన లబ్ధిదారులకు కొత్త క్యూఆర్ ఆధారిత స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.

**ప్రజాపక్షం/మర్రిగూడ :** అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందిస్తామని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు.తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.





## శాస్త్రీయ విద్యా విధానానికై విద్యార్థులు ఉద్యమించాలి



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** శాస్త్రీయ విద్యా విధానం కోసం, విద్యార్థులు ఉద్యమించాలని సిపిఐ రాష్ట్ర కమిటి సభ్యులు దూళిపాళ ధనుంజయనాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య 90వ వార్షికోత్సవాల సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో విద్యార్థులకు సంఘం ఉండాలని, ఆలోచన చేసి ఏర్పడిన ఎఐఎస్ఎఫ్ లో నాటి మేధావులు మాజీ ప్రధానులైన జవహర్‌లాల్ నెహ్రూ, అటల్ బిహార్ వాజ్‌పేయి, ఐకె గుజ్రాల్, తెలంగాణ రాష్ట్రంలో ఈనాడు రామోజీరావు, వందేమాతరం శ్రీనివాస్, టి.కృష్ణ, మాదాల రంగారావు లాంటి ఉద్దండులందరూ ఎఐఎస్ఎఫ్‌లో సభ్యులుగా కొనసాగారన్నారు. చదువుతూ పోరాడు అన్న నినాదంలో ఎఐఎస్ఎఫ్ కొనసాగుతున్నదని అన్ని సామాజిక అంశాలలో ఎఐఎస్ఎఫ్ బాధ్యత వహించాలన్నారు. ఏ రాజకీయ పార్టీకి అనుబంధ సంఘం కాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొమరాజు వెంకట్, ఇన్సాఫ్, ఎస్‌కె సయ్యద్ పాషా, బాలాజీ, సైదులు, ఏకశ్రీ, సమీనా, మచ్చ సౌజన్య పాల్గొన్నారు.

## పేద విద్యార్థుల అభ్యున్నతికి అంబేద్కర్ యూనివర్శిటీ వరం




**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** పేద విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికి తీసి స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ ఓ వరం లాంటిదని బిఆర్ ఎఓ యు ఎక్స్టెన్షన్ సెంటర్ నోడల్ అధికారి ప్రొఫెసర్ డాక్టర్ బి.ధర్మానాయక్ అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాయన కేంద్రంలో నిర్వహించిన కౌన్సిలర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దూరవిద్య ద్వారా లభిస్తాయని అన్నారు. ఆధునిక అవసరాలకు అనుగుణంగా నూతన కోర్సులు, విద్యా విధానాలను అమలు చేస్తోందని, మహిళ విద్యార్థినులకు విహబ్ ద్వారా వ్యాపారాభివృద్ధి, ఆవిష్కరణలు, నైపుణ్య శిక్షణ, మార్గదర్శకత్వం అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్ లెర్నింగ్ పద్ధతిలో ప్రపంచంలో ఎక్కడ నుంచైనా తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో పిజి, ఎంబిఎ చేసే అవకాశం అంబేద్కర్ యూనివర్శిటీలో మాత్రమే ఉందని వివరించారు. యూనివర్శిటీ టిసిఎస్, ఐకాన్, రామానంద తీర్థ ఇనిస్టిట్యూట్, రాశీ, విహబ్ వంటి సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుందని తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందవచ్చని తెలిపారు. 2026 విద్యా సంవత్సరానికి యుజి,పిజి, డిప్లొమా సర్టిఫికెట్ తదితర కోర్సుల్లో ప్రవేశాలు కొనసాగుతున్నాయని , అర్హులైన విద్యార్థులు సెప్టెంబర్ 30లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామారావు, కోఆర్డినేటర్ ఎస్ బాలరాజు, సైదానాయక్, అధ్యయన కేంద్ర కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## పిఎసిఎస్ భువనగిరి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** పిఎసిఎస్ భువనగిరి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం భువనగిరి మండలంలోని అనాజిపురం గ్రామంలో ఎస్‌విఎస్ ఫంక్షన్ హాల్‌లో జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసనసభ సభ్యులు కుంభ అనిల్ కుమార్ రెడ్డి హాజరైయారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పక్కిరు కొండల్ రెడ్డి సంఘ సభ్యులు, రైతులు, అధికారులు సంఘ పురోగాభివృద్ధి ఎంతగానో తోడ్పడుతున్నారని ఎప్పటికీ ఇలాగే ఉండాలని సభ్యులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ అవేస్ చిస్తీ, మార్కెట్ కమిటీ చైర్మన్, చందుపట్ల పిఎసిఎస్ చైర్మన్ జిలుగు సతీష్ పవన్, మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ వైస్ చైర్మన్, బీబీనగర్ పిఎసిఎస్ చైర్మన్, మాజీ పిఎసిఎస్ చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి, మాజీ పిఎసిఎస్ వైస్ చైర్మన్ ఎల్లంల జంగయ్య, పిఎసిఎస్ భువనగిరి డైరెక్టర్లు, భువనగిరి మున్సిపల్ కౌన్సిలర్లు, బొనగిరి మండలం సర్పంచులు, రైతులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట మండల వ్యాప్తంగా ఉన్న ఎరువుల దుకాణాల్లో సోమవారం రామన్నపేట వ్యవసాయ అధికారి (ఏఓ) ఎజాజ్ అలీ ఖాన్, రామన్నపేట మండల పరిశీలన అధికారిగా ఉన్న బీబీనగర్ ఏఓ సిహెచ్.పద్మలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పలుషాపుల్లో ఉన్న స్టాక్ రిజిస్టర్లు, బిల్లులు, ఎరువుల నిల్వలు, ధరల పట్టికను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని,నకిలీ ఎరువులు విక్రయించే డీలర్లపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రతి రైతు ఎరువులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా డీలర్ నుండి బిల్లు,రశీదు తీసుకోవాలని,నకిలీ ఎరువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని రైతులకు అవగాహన కల్పించారు.నాణ్యత లేని ఎరువులు, అధిక ధరలకు విక్రయిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ తనిఖీల్లో పలువురు డీలర్లు, రైతులు పాల్గొన్నారు.





## ప్రసవం వేళ ఊపిరి కష్టమైనా తల్లిబిడ్డను కాపాడిన వైద్యులు

**ప్రజాపక్షం/కోదాడ :** తీవ్రమైన ఊపిరితిత్తుల సమస్యలు, పల్మనరీ హైపర్‌టెన్షన్‌తో బాధపడుతున్న 37 ఏళ్ల గర్భిణీకి మలక్‌పేట్ యశోద సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి వైద్యులు విజయవంతంగా ప్రసవం నిర్వహించారు. మంగళవారం కోదాడ పట్టణంలోని పబ్లిక్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ జోష్న చికిత్సకు సంబంధించి వివరాలను వెల్లడించారు. చిన్ననాటి నుంచి పోలియోతోపాటు కైఫోస్కోలియోసిస్, రిస్ట్రిక్టివ్ లంగ్ డిసీజ్, టైప్2 రెస్పిరేటరీ ఫెయిల్యూర్‌తో బాధపడుతున్న ఆమె 34 వారాల 4 రోజుల గర్భంతో తీవ్రమైన శ్వాస సమస్యతో ఆసుపత్రిలో చేరినట్లు తెలిపారు. వైద్యులు ఐసియులో ఉంచి బిఐపిఏపి శ్వాస సహాయం అందిస్తూ పల్మనాలజీ, కార్డియాలజీ, గైనకాలజీ, అనస్థిసియా, నియోనాటాలజీ నిపుణుల సమన్వయంతో చికిత్స అందించినట్లు వివరించారు. 2.2 కిలోల బరువున్న మగ శిశువు సురక్షితంగా జన్మించినట్లు తెలిపారు. డాక్టర్లు రామకృష్ణ, యుగంధర్ బట్టు, మేనేజింగ్ డైరెక్టర్ వాసు కిరణ్ రెడ్డి, వెంకటరత్నాకర్ పాల్గొన్నారు.

## దక్షిణ భారత చారిత్రక వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం చరిత్ర విభాగం ఆధ్వర్యంలో తలపెట్టిన 45వ సౌత్ ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ సెషన్ ఏర్పాట్ల సమీక్షను, స్థానిక సెక్రటరీ ఆధ్వర్యంలో సవివరంగా పొందుపరిచిన సర్క్యులర్ ను మంగళవారం ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్, కమిటీ సభ్యులు విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిస్టరీ కాంగ్రెస్ ద్వారా దక్షిణ భారత చరిత్ర వైభవాన్ని చాటి చెప్పాలని, ఈ సమ్మేళనం విలువైన చారిత్రక అంశాలను వెలికి తీసే సందర్భంగా పేర్కొన్నారు. దేశ నలుమూలల నుండి చరిత్రకారులు పాల్గొనే విధంగా ఏర్పాట్లను చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి,ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ డైరెక్టర్ ఆచార్య ఆకుల రవి,ప్రిన్సిపాల్ అరుణప్రియ,శ్రీదేవి,హరీష్ కుమార్, ఆచార్య వసంత,ఆచార్య రఘురామారావు,వై ప్రశాంతి, ఆచార్య అలువాలా రవి,ఆ చార్య శ్రీనివాస్, విజయబాబు, డా పనస రామ కృష్ణ,షరీఫ్,శ్రీనివాస్‌పాల్గొన్నారు.

## విద్యతో పాటు క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదం

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** విద్యతో పాటు క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అనంతారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సూర్యాపేట నియోజక వర్గ స్థాయి స్కూల్ గేమ్స్ కబడ్డీ టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్‌ను గ్రామ సర్పంచ్ మామిడి శోభ శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు నియోజక వర్గ స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మెడిసిన్ సీటు సాధించిన అనంతారం గ్రామానికి చెందిన బాలికకు రూ.10వేలు విరాళం అందజేసి అభినందించారు. మండల విద్యాధికారి నకిరేకంటి రవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు పోతు భాస్కర్, ప్రధానోపాధ్యాయులు చికూరి అంజయ్య, ఎండి షరీఫ్, నాయకులు గజ్జల సైదిరెడ్డి, జానిమియా పాల్గొన్నారు.



# వాళ్ళతోనే పనిచేయించుకో!

### నా వద్దకు రావద్దు...!!!

### సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ తీరుపై అధికార పార్టీ కౌన్సిలర్ భర్త అవాక్



**ప్రజాపక్షం/సూర్యాపేట** : ప్రజా సమస్యలను వివరించేందుకు సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ వద్దకు వెళ్ళిన 25వ వార్డు కౌన్సిలర్ కోడి శిరీష భర్త శివకు చేదు అనుభవం ఎదురైంది. తన వార్డులో నాగులమ్మ గుడి సమీపంలో ఉన్న పాత బావితో తీవ్ర ఇబ్బందులు పడుతున్న స్థానిక ప్రజలు దానిని పూడ్చాలని డిమాండ్ చేస్తూ స్థానిక కౌన్సిలర్‌తోపాటు అధికారులకు గత కొన్ని నెలలుగా చెబుతూ వస్తున్నారు. ఎవరూ స్పందించకపోవడంతో ఇటీవల వారు ఆందోళనకు దిగారు. పలు పత్రికల్లో వార్తా కథనాలు కూడా ప్రచురితమ య్యా యి. ఇది తీవ్ర రూపం దాల్చడంతో ప్రజల ఇబ్బందులను మరోమారు వివరించేందుకు మున్సిపల్ కమీషనర్ హన్మంత రెడ్డి వద్దకు సోమవారం వెళ్ళారు. స్థానిక ప్రజలు ఆందోళన చేసిన విషయమై పత్రికల్లో వచ్చిన వార్తా కథనాలను వారి ముందు ఉంచగా వార్త రాశారుగా... వాళ్ళతోనే పనిచేయించుకో... అంటూ పత్రికలను, వార్తా కథనాలు రాసిన పాత్రికేయులను కించపర్చేలా మాట్లాడడంతో పాటు... నాకు ఎన్నో పనులున్నాయి... కింది వారితో పనిచేయించుకోండి... నా వద్దకు రావద్దంటూ విసుక్కోవడంతో అధికార పార్టీకి చెందిన కోడి శివ ఒక్కసారిగా అవాక్కయ్యాడు. వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఓ ప్రజాప్రతినిధి భర్తగా, అధికార పార్టీ నాయకుడిగా తాను కమీషనర్ దృష్టికి తీసుకువెళ్తే నిర్లక్ష్యంగా మాట్లాడడంతోపాటు తనను అవమానపర్చేలా ప్రవర్తించాడంటూ మీడియా ముందు వాపోయాడు. తనకు జరిగిన అవమానాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ ముందు వెలుబుచ్చిన వైనం మున్సిపల్ కమీషనర్ హన్మంత రెడ్డి తనను అవమానించినట్లుగా మాట్లాడడంపై మంగళవారం కోడి శివ మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాదిని కలిసి వివరించారు. వారు మాట్లాడిన మాటలను ఆవేదనతో వెలుబుచ్చారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలంటూ తాను కమీషనర్‌ను పదే పదే కలుస్తూ చెబుతుంటే ఏ మాత్రం పట్టించుకోవడం లేదని తమ వార్డులో ఉన్న పాత బావితో మురుగు వాసన, దోమల బెడద, పురుగుల స్వైర విహారంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గత 5 నెలల క్రితం వార్డును పర్యటించిన తమ దృష్టికి కూడా తేవడం జరిగిందని దీనిపై స్పందించిన తమరు దానిని పూడిపిస్తామని హామీ ఇచ్చి నేటికి నెరవేర్చలేదని వారి ముందు వాపోయారు. ఇదే విషయం కమీషనర్‌ను కలిసి అనేక మార్లు వివరించినా పట్టించుకోవడం లేదని పైగా అవమానపర్చినట్లుగా మాట్లాడారని తాను అధికార పార్టీ కౌన్సిలర్ భర్తనైనా తమ వార్డులో ప్రజా సమస్యలు పరిష్కరించుకోలేని నిస్సాహాయ స్థితిలో ఉన్నానని ఆవేదన వెల్లబుచ్చారు. కమీషనర్ హన్మంత రెడ్డి తీరుపై ఈ ఒక్క కౌన్సిలర్ భర్తనే కాదు ప్రతి ఒక్కరూ మొదటి నుండి మండిపడుతున్నారు. పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏనాడు తెలుసుకునేందుకు సీటు మీద కూర్చొని కదలని కమీషనర్ తమ వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని కౌన్సిల్ సమావేశాల్లో మొదటి నుండి కౌన్సిలర్లు గళం ఎత్తి చెబుతూనే ఉన్నారు. ఇతడి తీరుపై ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేసేందుకు ఏకమవుతున్నారు.



## కబడ్డీ పోటీలకు సర్వం సిద్ధం

**ప్రజాపక్షం/మోటకొండూర్** : నేటి నుండి ప్రారంభం కానున్న తుమ్మల ప్రసూనా రెడ్డి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో తుమ్మల కీర్తివర్ధన్ రెడ్డి సౌజన్యంతో అండర్ 14 చాంపియన్ షిప్ క్రీడా పోటీలకు మాటూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముస్తాబు అయింది. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కబడ్డీ కోర్టులు, క్రీడాకారుల విశ్రాంతి ప్రదేశాలు, తాగునీరు, వైద్య సదు పాయాలు, భద్రతా ఏర్పాట్లు, వసతి మరియు ఇతర మౌలిక సదు పాయాలను నిర్వాహకులు సిద్ధం చేశారు.జిల్లాలోని వివిధ మండ లాల నుంచి ప్రతిభావంతు లైన బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొన నున్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేసి తదుపరి స్థాయి పోటీలకు పంపించనున్నట్లు నిర్వాహ కులు తెలిపారు.

## రైతుల ప్రత్యేక క్యాంపు

**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** రైతుల ప్రయోజనార్థం, వివిధ పథకాల ఈ కేవైసి ప్రక్రియను పూర్తి చేయడం కోసం స్థానిక గ్రామ పంచా యతీ కార్యాలయంలో ఒక ప్రత్యేక వెరిఫికేషన్ క్యాంపు నిర్వహించి నట్లు అధికారులు తెలిపారు. సంక్షేమ పథకాలు నేరుగా అర్హులకే అందేలా డేటాను అప్‌డేట్ చేయడం కోసం ఈ కార్యక్రమం చేపడు తున్నట్లు పేర్కొన్నారు. క్యాంపుకు వచ్చిన రైతులు తమ ఆధార్ కార్డుతో పాటు ఓటీపి వెరిఫికేషన్ కోసం ఆధార్ నెంబర్‌ను అనుసం ధానం మొబైల్ ఫోన్ తప్పనిసరిగా వెంట తీసుకరావాలని అధికా రులు తెలిపారు.

## జంకు ఫుడ్‌పై పూర్తిగా అవగాహన

**ప్రజాపక్షం/వేములపల్లి:** జంక్ ఫుడ్ పై చిన్న పిల్లల తల్లులకు బాలింతలకు పూర్తి అవగాహన కల్పించాలని సర్పంచ్ సందీప్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎస్‌సి క్యాంప్ అంగన్వాడీ కేంద్రంలో సూపర్వైజర్ పరిమి రజనీతో కలిసి 9వ పోషణ మాస కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు అనంతరం సూపర్వైజర్ పరిమి రజిని మాట్లాడుతూ గర్భిణీలకు బాలింతలకు ఏడు నెలల నుండి ఆరు సంవత్సరాల పిల్లల వరకు పోషకాహారం అవసరమని ప్రతిరోజు భోజనంలో ఆకుకూరలు చిరుధాన్యాలు పండ్లు గుడ్లు చేపలు ఉండేలా చూసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పిఆర్‌పిఏ బిందు,పోషణ అభియాన్ బీసీ రమణి,అంగన్వాడీ టీచర్స్ శోభారాణి,జయమ్మ, రజిత, శశికళ,ఆశా వర్కర్స్ కౌసల్య,చిన్న పిల్లల తల్లులు బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ నియామక ప్రకటన

**ప్రజాపక్షం/తిప్పర్తి** : మండలంలోని కెజిబివి బాలికల వసతి గృహంలో హెడ్ కుక్,డే వాచ్ వుమెన్ పోస్టులను తాత్కాలిక పద్ధతిన భర్తీ చేసేందుకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తు న్నట్లు ఎంఈఓ నరసింహా నాయక్ తెలిపారు.హెడ్ కుక్,డే వాచ్ వుమెన్ 10వ తరగతి ఉత్తీర్ణత,18 నుంచి 40 ఏళ్ల మధ్య ఉండాలి.స్థానికులకు ప్రాధాన్యత,అక్టోబర్ 3వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు కెజిబివి తిప్పర్తిలో అందజేయాలి.

## ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచిన ఎస్ఐ విజయభాయి

**ప్రజాపక్షం / నల్లగొండ టౌన్:** పోలీసు విధి అంటే కేవలం ట్రాఫి క్‌ను నియంత్రించడం,నిబంధనలు అమలు చేయడం మాత్రమే కాదని..ఆపదలో ఉన్న మనిషికి ఆపన్నహస్తం అందించడమే అస లైన మానవత్వమని నల్లగొండ ట్రాఫిక్ మహిళా ఎస్ఐ విజయ భాయి చాటిచెప్పారు. పట్టణంలోని గడియారం సెంటర్‌లో మంగళ వారం కారు,బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి గాయాలపాల య్యాడు.ప్రమాదం జరిగిన సమయంలో అక్కడే ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న విజయభాయి గమనించారు.గాయపడిన వ్యక్తి రోడ్డుపై బాధతో ఉండటాన్ని చూసిన ఆమె వెంటనే స్పందిం చారు.ఎలాంటి ఆలస్యం చేయకుండా 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. అంబులెన్స్ వచ్చే వరకు గాయప డిన వ్యక్తి వద్దే ఉండి పరిస్థితిని గమనించారు.అంబులెన్స్ చేరుకున్న వెంటనే స్వయంగా ముందుకు వచ్చి గాయపడిన వ్యక్తిని అంబులె న్స్‌లోకి ఎక్కించడంలో సహకరించారు.



## తైక్వాండోలో 19 మంది విద్యార్థినులకు బ్లాక్ బెల్ట్

**ప్రజాపక్షం/బీబీనగర్** : తైక్వాండో పోటీల్లో మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు సత్తా చాటారు. ఈ నెల 25, 26 తేదీల్లో జోగులాంబ గద్వాల జిల్లాలోని బృందావన్ గార్డెన్‌లో నిర్వహించిన తైక్వాండో పోటీల్లో కళాశాలకు చెందిన 19 మంది విద్యార్థినులు ప్రతిభ కనబరిచి బ్లాక్ బెల్ట్ సాధించారు. టీఎస్టీఏ జనరల్ సెక్రటరీ కురువ శ్రీహరి ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. బ్లాక్ బెల్ట్ సాధించిన విద్యార్థినులు వి.రాణి, ఎన్.స్పందన, ఎస్.మాధురి, టీ.వరలక్ష్మి, ఏ.శైలజ, వి.సంధ్య, బి.ఐశ్వర్య, పి.సౌమ్య, ఎం.యమున, ఎన్.ప్రశాంతి, టీ.అఖిల, కె.వైష్ణవి, పి.నందిని, ఎం.ఆరాధన, సి.చరిత, పి.సంధ్యారాణి, ఏ.శ్రీలేఖ, వి.స్వప్నలను కళాశాల ప్రిన్సి పల్ డా.వేల్పూరి రాధ (ఎఫ్ఏసీ) అభినందించారు. విద్యా ర్థినులు క్రీడల్లోనూ రాణిస్తూ కళాశాలకు మంచి పేరు తీసు కురావడం అభినందనీయమని ఆమె పేర్కొన్నారు.

## కరాటేలో లింటుకు బంగారు పతకం

**ప్రజాపక్షం/బీబీనగర్** : జీకేఐ షోటోకాన్ కరాటే 11వ తెలంగాణ స్టేట్ కరాటే ఛాంపియన్షిప్‌వారియర్ కప్ పోటీల్లో వలిగొండ TGSWRS JC(G) పాఠశాల విద్యా ర్థిని రేపాక లింటు ప్రతిభ చాటింది. ఈ నెల 27న నల్గొం డలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో జూనియర్ రెడ్బెల్ట్ కటా విభాగంలో పాల్గొన్న లింటు అద్భుత ప్రదర్శ నతో బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా లింటును పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.రూప, ఉపాధ్యా యులు అభినందించారు. విద్యార్థిని విజయానికి సహక రించిన తల్లిదండ్రులు రేపాక శివ, అనురాధతో పాటు కరాటే మాస్టర్లను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



## లో వోల్టేజ్ సమస్యలు తీర్చేందుకే విద్యుత్ కేంద్రాలు ఏర్పాటు

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** : మండ లంలో చిమిర్యాల గ్రామ రెవెన్యూ పరిధిలో 33/11 కె.వి విద్యుత్ ఉపకేంద్రం మూడు కోట్ల వ్యయంతో నిర్మాణం చేపట్టిన సబ్ స్టేషన్ ను ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, స్థానిక ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల కరెంటు కష్టాలు తీర్చేందుకే ప్రభుత్వం గ్రామాలలో విద్యుత్ ఉప కేంద్రాలు నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని అన్నారు. ఎల్ నీ నో ప్రభావం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయని పకృతి వైపరీత్యాలను అందరూ అర్థం చేసుకోవా లని, కరెంటు సమస్యలపై ప్రతిరోజు ఆ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులతో మాట్లాడుతున్నానని ఎమ్మెల్యే అన్నారు. త్వరలోనే సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక లో ఒక సబ్ స్టేషన్, నాంపల్లి



మండలంలో మరొక సబ్ స్టేషన్ రాబోతుందని తెలి పారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మునుగోడు నియోజకవర్గం అత్యంత వెనుకబడిన ప్రాంతం మని, శివన్నగూడెం రిజర్వాయర్ లోకి నీరు ఎక్కడి నుంచి తీసుకురావాలేది గత ప్రభుత్వం డిసైడ్ చేయలేకపోయింది కానీ ఎద్దుల రిజర్వాయర్ నుండి శివనగర్ రిజర్వాయర్ కు మీరు తీసుకొస్తా మని రైతులు ఆధైర్య పడవద్దని హామీ ఇచ్చారు. స్థానిక సర్పంచ్ రమేష్,ట్రాన్స్ కో ఏసి, కందుల రమేష్, ట్రాన్స్ కో అధికారులు పాల్గొన్నారు.

## బిఆర్ అంబేద్కర్ దూరవిద్యతో ఉన్నత విద్య ఉపాధి

**ప్రజాపక్షం/కోదాడ:** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా యూజీ, పిజి కోర్సులు చదివి ఉన్నత విద్యతో పాటు ఉపాధి అవ కాశాలు లభిస్తున్నాయని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డాక్టర్ ధర్యానాయక్ అన్నారు. మంగళవారం కోదాడలోని కెఆర్ఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో కౌన్సిలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యలో వస్తున్న సాంకేతిక మార్పును అన్వయించు కుంటూ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అనేక కొత్త కోర్సులను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకవచ్చింది. ఆన్‌లైన్ లెర్నింగ్ విద్యా విధానం ద్వారా ప్రపంచంలో ఎక్కడ నుంచైనా తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో అన్ని సబ్జెక్టుల పిజి, ఎంబిఏ వంటి కోర్సులు చేసే అవకాశం ఇక్కడ మాత్రమే



ఉందన్నారు. 2026 విద్యా సంవత్సరంలో యుజి, పిజిలో చేరేందుకు అడ్మిషన్ల ప్రక్రియ ఈనెల 30వ వరకు ఉందని, అర్హులైన యువతి, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హదసా రాణి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చందా అప్పారావు, కోఆర్డినేటర్ సైదులు, అధ్యాపకులు, సైదిరెడ్డి, నిర్మ లకుమారి, శ్రీలత, పల్లపాటి సైదులు, యాదమ్మ, జాక్సో సురేష్‌నాయక్ పాల్గొన్నారు.

## పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు నమోదు షెడ్యూల్ విడుదల

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : వరంగల్‌ఖమ్మంనల్ల గొండ పట్టభద్రులనియోజకవర్గం 12 జిల్లాల పరి ధిలోని ఓటరు నమోదు,కొత్త ఓటర్ల జాబితాకు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి బి.చంద్రశేఖర్ తెలి పారు.మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వరంగల్‌ఖమ్మంనల్లగొండ పట్టభద్రుల ఎన్నికల ఓటరు జాబితాపై అన్ని రాజ కీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావే శంలో కలెక్టర్ మాట్లాడారు.ఓటరు నమోదు నోటిఫి కేషన్ షెడ్యూల్ ఈ నెల 28న విడుదల చేశా మని,దినపత్రికలతో పాటు జిల్లా కలెక్టర్, ఏఈఆ ర్ఓ కార్యాలయాల్లో ప్రచురించినట్లు తెలిపారు. అక్టోబర్ 15న, తిరిగి అక్టోబర్ 25న మరోసారి దిన పత్రికల్లో ప్రచురించనున్నట్లు చెప్పారు. ఫారం 18లో దరఖాస్తు గడువు నవంబర్ 6,ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ నవంబర్ 25,అభ్యంత రాల స్వీకరణ 25 నుంచి డిసెంబర్ 10 వరకు, అభ్యంతరాల పరిష్కారం డిసెంబర్ 25,తుది ఓటరు జాబితా ప్రచురణ డిసెంబర్ 30 ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు.ఈ సమావేశంలో అద నపు కలెక్టర్ జె.శ్రీనివాస్,రాజకీయ పార్టీల ప్రతిని ధులు,తదితరులు పాల్గొన్నారు.